# అబ్బాయి పెళ్ళి

"ప్రమత"

[మధ్యాహ్నం పదకొండు గంటలు. సుందరయ్య ఇంట్లో]

సుందరయ్య:_ఏమేవ్ ఇలారా! తమలపాకులు లేవా ఈ రోజు?

సరసమ్మ:_ఉన్నయ్యండి! వస్తున్నా. (తమలపాకుల పళ్లెంతో వస్తుంది)

సుం:_అవునుగాని, ఈరోజేగదూ అబ్బాయి వస్తే?

స:_అవునండి. ఇవ్వాళ వస్తాడు.

సుం:_ఈ ఏడు వాడి పెళ్ళిచేస్తానే. నేను పెద్దవాడి నయ్యాను.

స:_(నవ్వి) నేను మాత్రం కాలేదా? శకుంతలను చేసికుందాము.

సుం:_ఆ లలితనే చేసికుందాము. మొన్న వాడు లలిత మీద ఇష్టమున్నట్లు మాట్లాడేడు.

స:_మొన్న శకుంతలమీద ఇష్టమున్నట్లు నాతో అన్నాడు.

సుం:_అబ్బ! మీ అన్నకూతురును చేసికుంటామని ఎంతాశ!

స:_మీ చెల్లెలు కూతురును చేసికుందామని లేదా మీకు?

సుం:_అందుకే లలితను చేసికుందాము.

స:_వద్దండి! లలిత బాగుండదు. చదువులేదు; కట్నం రాదు.

సుం:_ఆ శకుంతలకుందా అందము? అయినా అందాన్నేం చేసికుంటావు?

స:_అందము తీసిపోతేనేం? చదువుంది.

సుం:_ఎందుకీ గోల తాంబూలాలు పుచ్చుకోటానికి మా బావను రమ్మంటాను.

స:_నే చస్తే ఒప్పుకోను. ఇవ్వాళే వ్రాయండి మా అన్నయ్యను రమ్మని.

సుం:_ఎందుకు?

స:_ముహూర్త నిర్ణయానికి.

సుం:_నే ఒప్పుకోను, లలితను చేసికుంటాను. ఏ వాడయినా మామగారిని సుఖపెట్టేది అదే.

స:_ఏ నాడయినా అత్తగార్ని సుఖపెట్టేది శకుంతలే!

సుం:_నీకు తెలీదు సరూ! ఊరుకో!

స:_(తమలపాకులు కోపంగా విసిరికొట్టి) మీకు తెలుసు. మీరు మా అన్నయ్యను రమ్మని వ్రాయండి.

సుం:_ఎందుకు మనకీ పోట్లాట అబ్బాయికి ఎవరు ఇష్టమయితే వాళ్ళను చేసికుంటాడు. సరేనా.

స:_సరె.

(వాకిట్లో బండి ఆగిన చప్పుడు చేతిలో బాగ్‌తో భాస్కరం, మాలతి ప్రవేశిస్తారు)

భాస్కరం:_నాన్న!

సుం:_వచ్చావా? రా! ఆ అమ్మాయి ...

భా:_మీ కోడలు-నా భార్య

స:_(ఆత్రంగా)ఆ ... ఆ! ఏమిటి నా కోడలా?

ఏమంటి చూస్తారేం?

భా:_ఏంచేస్తారు.? ఇన్నాళ్లు మీరు చెప్పినట్లు విన్నాను. ఇక వినదలచలేదు.

స:_ఏమిట్రా ఈ మాటలు (విచారంగా) ఆ శకుంతల గతి ఏమిటి?

భా:_మరొకర్ని చేసికోమను. ఇంకానయం ఆ గయ్యాళిని కట్టుకుంటే నా బ్రతుకు తెలిపోయిఉండేది.

స:_ఏంమాటలు రా అవి?

భా:_మాలతీ! బండిపిలు వెళ్ళిపోదాము.

సుం:_ఎక్కడికి?

భా:_నాకు గుంటూరులోనే ఉద్యోగం దొరికింది నాన్నా!

సుం:_ఎక్కడికి వద్దు ఉండు.

మాలతి:_బండివచ్చిందండి!

భా:_వస్తున్నా, నాకు తెలుసు నాన్నా ఇక్కడుంటే అమ్మదగ్గర నిలవలేదు మాలతి.

స:-ఆ మాటనిజమే! (కసిగా అంటుంది)

భా:_మాలతీ నాన్నకు నమస్కారం చేసితా.

మా:_(నమస్కరిస్తుంది) వెళ్ళొస్తామమామయ్యా!

సుం:_శుభంగా పోయిరాతల్లీ.

(భాస్కరం మాలతి నిష్క్రమణ)

సుం:_అబ్బాయి పెళ్ళి సమస్య తేలిపోయింది. ఇంకా విచారించకు.

స:-ఓనాడువిచారించానుగనక నా!

సుం:_అంతేలే!

ఒక తరగతిలో నీతి కథలు చెప్పుతున్న ఉపాధ్యాయుడు "మీలో నెందరికి స్వర్గమున కెళ్లడాని కిష్టమో చేతులెత్తండి" అన్నాడు విద్యార్థుల నుద్దేశించి.

తరగతిలో నందరు ఒక్క బాలుడుతప్ప చేతులెత్తారు.

మాష్టరు "గోపాల్! నీకు స్వర్గానికి వెళ్లడం యిష్టంలేదన్నమాట!" అన్నాడు.

"ఇష్టములేకేమండీ! - కాని....మా అమ్మ స్కూలు వదలగానే సరాసరి యింటికి వచ్చెయ్యమంది."

వేముల కుటుంబరావు